www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 డిసెంబర్ 2024
5
అన్నమయ్య



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 28వ తేదీన మదనపల్లెలో నిర్వహించే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి నరసింహ కోరారు. గురువారం మదనపల్లెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జ్ఞానాంబిక గ్రౌండ్ నుండి ర్యాలీ ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ఈ ర్యాలీకి ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు వి.పి.సాను, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ విసి కె.వెంకట్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.పరమేష్ పాల్గొంటారని తెలిపారు. జిఆర్‌టి పాఠశాల మైదానంలో బహిరంగ సభ ఉంటుందన్నారు. విద్యార్థులు ర్యాలీ, బహిరంగ సభలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ మదనపల్లి పట్టణ నాయకులు జయబాబు, ఆఫ్రిద్, ప్రేమ్ కుమార్, సమీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహ

సామాన్యులపై రిజిస్ట్రేషన్ భారం



- భూముల విలువతోపాటు రిజిస్ట్రేషన్ ఫీజు గణనీయంగా పెంపు - జనవరి 1 నుంచి అమలులోకి కొత్త ఛార్జీలు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

రాబోయే కొత్త సంవత్సరంలో భూములు, స్థలాలు, ఇళ్ల కొనుగోలు చేసే, విక్రయించే వారిపై రిజిస్ట్రేషన్ భారం పడనుంది. ముఖ్యంగా పట్టణంలో కమర్షియల్ ఏరియాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నారు. ప్రస్తుతం ఎకరా ధర రూ.22 లక్షలు ఉంటే ఆ భూమిని బయట వ్యక్తులకు విక్రయిస్తే రిజిస్ట్రేషన్ ఫీజు 7.5 శాతం అంటే రూ. 1.65 లక్షలు వసూలు చేస్తారు. రాబోయే కాలంలో ప్రభుత్వం 15 శాతం భూమి విలువ పెంచితే ఈ ప్రాంతంలో ఎకరాకు అదనంగా రూ. 3.30 లక్షలు చొప్పున రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు ఎకరా విలువ రూ.25.30 లక్షలు అవుతుంది. ఈ విధంగా చూస్తే దీనిపై రిజిస్ట్రేషన్ చేయించేందుకు ఎకరానికి రూ.1.89,750 అవుతుంది. అంటే రిజిస్ట్రేషన్ చెల్లిస్తున్న దాని కంటే ఎకరానికి అదనంగా రూ.24,750 కట్టాల్సి ఉంది. నియోజకవర్గంలో ఉద్యానవన పంటలైన చీనీ, అరటి అధికంగా పండించడంతో ఆర్థికంగా స్థిరపడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. భూముల ధరలు కూడా అధికంగా ఉన్నాయి. వ్యవసాయేతర భూముల విలువలు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయంటున్నారు. ఇప్పటికే ఇక్కడి భూముల ధరల సవరణ కమిటీలు ధరల పెంపుపై సర్కారుకు ప్రతిపాదించాయి. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు, డిమాండుకు అనువుగా ధరల పెంపుపై అధికారులు పకడ్బంధీగా ప్రతిపాదనలు రూపొందించారు. జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో భూముల ధరలను ఖరారు చేసేలా మార్గదర్శకాలు జారీ చేశారు. విలువల సవరణ ప్రతిపాదనలకు జిల్లా కమిటీల ఆమోదం తెలిపిన తర్వాత ఈ నెల 20న స్టార్ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో కొత్త ధరలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ నెల 24 వరకు వచ్చిన అభ్యంతరాలు, సలహాలు, సూచనలను ఈ నెల 27న పరిశీలిస్తారు. 2025 జనవరి 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని జిల్లా రిజిస్ట్రార్లను ఆదేశిస్తూ రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఐటీ శేషగిరిబాబు ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ మార్గ దర్శకాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. తాజా నిర్ణయంతో ప్రస్తుత ధరలపై 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు



పట్టణ ప్రాంతాల్లో గణనీయంగా పెంపు

ముఖ్య పట్టణాల్లో భూముల విలువలను గణనీయంగా పెరగబోతున్నాయి. ప్రస్తుతం రూ.50 లక్షలు విలువైన ప్లాట్ కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్ ఛార్జీలు రూ.4 లక్షలు. ఇప్పుడు దాని విలువ 30 శాతం పెరిగితే రిజిస్ట్రేషన్ చార్జీలు అదనంగా రూ.2.50 లక్షలు అంటే రూ.6.50 లక్షలు కట్టాల్సి వస్తుంది. రూరల్ ప్రాంతంలో రూ.30 లక్షల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రస్తుతం రూ.2.40 లక్షలు అవుతుండగా. అవి 2 లక్షలకు పెరగనున్నాయి. ఇలా అన్ని చోట్లా భూముల విలువను బట్టి రేట్లు భారీగా పెరిగిపోనున్నాయి. జనవరి 1 నుంచి ఈ పెరుగుదల అమల్లోకి రానుంది. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇటీవల మెమో, ప్రొసీడింగ్స్ జారీ చేశారు ధరల పెంపుతో ప్రస్తుతం ఆపార్ట్మెంట్స్ క్రయ విక్రయాలు సైతం భారం కాబోతున్నా యంటున్నారు.

ఉపాధిపై గొడ్డలి పెట్టు

భూములు, రిజిస్ట్రేషన్ల పెంపు నిర్ణయం ఉపాధి రంగంపై తీవ్ర ప్రభావం చూపనుందంటున్నారు. జిల్లావ్యాప్తంగా వందలాది మంది రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా ప్రభుత్వానికి కూడా పెద్దమొత్తంలో ఆదాయం సమకూరుతోంది. ఆరు నెలల కిందట పెంచిన ధరల కారణంగా కొంతమేరకు రియల్ వ్యాపారం తగ్గిపోయిందంటున్నారు. మళ్ళీ గోరు చుట్టపై రోకలి పోటులాగా భూముల విలువలు, రిజి స్ట్రేషన్ ఛార్జీలు పెరగబోనుండడంతో ఇక రియల్ ఎస్టేట్ కుదేలు కానుందంటున్నారు. కరోనా ప్రభావం నుంచి కోలుకుంటున్న రియల్ ఎస్టేట్ రంగం ధరల పెంపు నిర్ణయంతో కుప్పకూలిపోయే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఈ వ్యాపారంపై ఆధారపడ్డ వారంతా ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కోవాల్సిన పరిస్థితి తప్పుకపోవచ్చుంటున్నారు.

తారుమారుకానున్న భూముల క్రయవిక్రయాలు

ప్రభుత్వం భూముల విలువలు అలాగే రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచేందుకు తీసుకోబోతున్న నిర్ణయం జిల్లాపై తీవ్రప్రభావం చూపనుందంటున్నారు. జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ, రెవెన్యూశాఖ అధికారులు విలువలు, ధరల పెంపు పై చేసిన ప్రతిపాదనలకు సర్కారు గ్రీన్ సిగ్నల్ జారీచేయడంతో అంతటా ఆందో ళన మొదలైంది. ఆరు నెలల కిందట జిల్లాలో భూముల విలువలను, రిజి స్ట్రేషన్ ఛార్జీలను భారీగా పెంచారు. వాటి నుంచి ఇప్పుడిప్పుడే కొలుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారంపై సర్కారు తాజా నిర్ణయం పిడుగుపాటుకు గురిచేసింది.

- రామనాథరెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పులివెందుల

సామాన్యులు భూములు కొనే పరిస్థితి ఉండదు

భూముల విలువ పెంచడం వల్ల సామాన్య ప్రజలు భూమి కొనే పరిస్థితి ఉండదు. భూమి విలువ పెరుగడంతోపాటు రిజిస్ట్రేషన్ విలువ కూడా పెరిగి సామాన్యుడికి మరింత భారం అవుతుంది. సామాన్యులు భూములు కొనే పరిస్థితి ఉండదు.

- రామాంజనేయులు, చిన్నకారు రైతు పులివెందుల


సమస్యలు వింటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

అధైర్య పడకండి తోడుగా ఉంటా

సమస్య ఉంటే నేరుగా నాతో చెప్పండి
వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమే
ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా
ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

అధైన పడకండి నీకు నేను తోడుగా ఉంటాను, సమస్యలు ఉంటే నేరుగా నాతో చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమేనని, సమస్యలపై పోరాటం చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి అన్నారు. నాలుగు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా మూడో రోజు గురువారం పట్టణం లోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఆయనని కలిసి సమస్యలను తెలియజేశారు. జగన్ స్పందిస్తూ ప్రతి ఒక్కరికీ న్యాయం జరగకపోతే పోరాటం చేసే దానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు. ఇకపై ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని నాయకులకు స్పష్టత ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజలు, వైసిపి శ్రేణుల సమస్యలను ఓపిగ్గా వింటూ చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తోడుగా నేనుంటానని వారికి భరోసా ఇచ్చారు. ప్రజలు ఈ సందర్భంగా పెన్షన్ తొలగింపు, విద్యుత్ ఛార్జీలు పెంపు తదితర సమస్యలను జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం చేస్తానని, మనకు అన్యాయం జరిగితే న్యాయపరంగా ముందుకువెళ్దామని, ఎవరు అధైర్య పడకుండా ముందుకు వెళ్లాలన్నారు

జగన్‌ను కలిసేందుకు పోటెత్తిన జనం

జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు రాయలసీమ జిల్లాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. మునుపు ఎన్నడూ లేని విధంగా ప్రజలతో గడుపుతుండడంతో ఆయన కలిసేందుకు భారీగా జనం తరలివచ్చారు. జగన్ కార్యాలయంతోపాటు ప్రాంగణం అంతా జనాలతో నిండిపోయింది. ఇసుక వేస్తే రాలని జనం రావడంతో వారిని అదుపు చేయలేక పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది.

కార్యకర్తల తోపులాట..

జగన్‌మోహన్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఉదయం 9:30 గంటలకు జగన్ తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించేందుకు వచ్చిన వెంటనే అక్కడికి వచ్చిన జనం జగన్ కలిసేదుకు భారీగా జనం రావడంతో తోపులాట జరిగింది. ఈ క్రమంలో కార్యాలయం కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. పోలీసులు ఎంత చెప్పినా ప్రజలు వినకపోవడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు లాఠీఛార్జ్ చేశారు. ప్రజలను కంట్రోల్ చేయడానికి రోప్ తెచ్చి పోలీసులు అదుపు చేశారు. తర్వాత ప్రజాదర్బార్ ప్రశాంతంగా జరిగింది.

వైసిపి ముఖ్య నేతలతో చర్చలు

వైసిపి ముఖ్యనేతలతో జగన్ పలు అంశాలపై చర్చించారు. రాయలసీమ జిల్లాలోని పలువురు నాయకులు జగన్ కలిశారు ఈ సందర్భంగా జిల్లాలలోని రాజకీయ విషయాలపై చర్చించినట్లు సమాచారం. శుక్రవారం చేపట్టబోయే విద్యుత్ ఛార్జీల పెంపు ధర్నాను విజయవంతం చేసేందుకు వైసిపి శ్రేణులను సన్నాయత్నం చేయాలని నాయకులకు చెప్పినట్టు తెలుస్తుంది. కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్.అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, కడప, రాయచోటి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యేలు అంజద్‌బాషా, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు సతీష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఇ రమణ

పిఎం సూర్యఘర్ పథకం ప్రయోజనకరం : ఎస్ఇ

ప్రజాశక్తి-పీలేరు

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకానికి క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం మన అందరిపై ఉందని విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.రమణ పీలేరు డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులను ఆదేశించారు. పీలేరు డివిజన్ ప్రగతిపై గురువారం ఆయన స్థానిక విద్యుత్ ఇఇ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన ద్వారా రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం ఒక కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తానికి అతి తక్కువ వడ్డీతో బ్యాంకులు రుణాలు అందిస్తాయని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలన్నారు. విద్యుత్ చౌర్యం, విద్యుత్ వృథాను పూర్తిగా అరికట్టాలని, పీలేరు డివిజన్ పరిధిలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు లో-వోల్టేజ్ సమస్యను అధిగమించాలని, అందుకు ఒక్కొక్కరు నెలకు నాలుగు ట్రాన్స్‌ఫార్మర్ల చొప్పున నిర్వహణ పనులు చేసే బాధ్యతలను తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ వాలి ఉన్న విద్యుత్ స్తంభాలను, లూజుగా ఉన్న లైన్లను ఎప్పటికప్పుడు సరిజేయాలని చెప్పారు. ముందుగా తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన వాటిని బాగు చేయాలని ఆదేశించారు. సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చే వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పనితీరు బాగాలేని వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో పీలేరు విద్యుత్ ఇఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇలు అమీర్ బాష, శివయ్య, పీలేరు, కెవి పల్లె, కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల ఎఇలు, జెఇలు, అకౌంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యర్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా రాయచోటి పురపాలక సంఘం పరిధిలోని వివిధ పనుల్లో నైపుణ్యం ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు సిటీ మిషన్ మేనేజర్ పి.అబ్బాస్ అలీఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి పురపాలక సంఘం పరిధిలో ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషన్లు, ఏసీ, గీజర్, వాషింగ్ మెషిన్ రిపేరు చేసేవారు, అలాగే బ్యూటీషియన్లలో అనుభవమున్న స్త్రీ, పురుషుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారికి నైపుణ్య అభివృద్ధి శిక్షణ ద్వారా శిక్షణ అనంతరం ధ్రువపత్రం అందిస్తామని అన్నారు. ఇందులో అర్హత పొందిన వారికి హోమ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌బోర్డ్ చేసి జీవన ఉపాధి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 30లోపు మెప్మా కార్యాలయంలో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాన్ కార్డు జిరాక్స్ తీసుకువచ్చి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 790160276,7901610324లోసంప్రదించాలని కోరారు.

నేడు ఉద్యోగ మేళాలు

ప్రజాశక్తి -రాయచోటి : ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎపిఎస్ఎస్‌డిసి), సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయంసంయుక్త ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని పీలేరు, రైల్వేకోడూరులో ఉద్యోగామెళాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపృభివృద్ధి అధికారి దాసరి నాగార్జున తెలిపారు.శుక్రవారం పీలేరు ఎస్.జి. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో, రైల్వే కోడూరు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్‌లో నిర్వహిస్తున్నారు అన్నారు. ఉద్యోగమేళాలో ఎస్‌బిఐ లైఫ్, ఐసిఐసి బ్యాంకు, ఎయూ స్మాల్ ఫినాన్స్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సురెన్స్ తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లాలోని ఆసక్తి గల యువతీ యువకులు ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో భూ బాధితులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని జిల్లాలోని బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె రెవెన్యూ గ్రామం దళితవాడకు చెందిన పోతగాళ్ళ వీరప్ప, రమణప్ప, వెంకటరమణ, వేమన్న డిమాండ్ చేశారు. గురువారం బాధితులు తమ కుటుంబీకులతో కలసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం గోళ్ళపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 427 బిటుబిలో 2.27 ఎకరాల భూమిని సాగుచేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం రీ సర్వే అనంతరం ఎల్‌పి నంబర్లతో సహా పట్టాదారు పాసుబుక్‌లను మంజూరు చేసిందంటూ తెలిపారు. గ్రామానికే చెందిన పెద్దకోనప్ప, వెంకటరమణ, చిన్నకోనప్ప, అలివేలమ్మతో పాటు మరో 12 మంది భూమి తమదంటూ మాపై దౌర్జన్యానికి దిగుతూఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారుల సహాయ, సహకారాలతో తప్పుడు ధృవీకరణ పత్రాలను పొందారన్నారు. తప్పుడు ధృవ పత్రాల మంజూరుపై కొత్తకోట తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ లాభం లేదన్నారు. అధికారుల నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాము మదనపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుండి టెంపరరీ ఇంజక్షన్ ఆర్డర్‌ను పొందామన్నారు. పైభూమితో ఎలాంటి సంబంధంలేని కొత్తకోటకు చెందిన సచిన్, సింగన్న, మదనపల్లికి చెందిన రెడ్డిప్రసాద్, రవిశంకర్, మనోహర్‌రెడ్డి, మరో 40 మందితో కలసి బుధవారం తమభూమిని కబ్జాచేయాలని చూశారన్నారు. అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేశారన్నారు. ఈవి షయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు తమపైనే బైండోవర్ కేసులు పెడతామంటూ బెదిరించా రంటూ ఆరోపించారు. కలెక్టర్ స్పందించి భూఆక్రమణ. దౌర్జన్యంలపై విచారించి తమకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. బాధితుల ధర్నాకు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. అనంతరం డిఆర్ఒ మధుసూదన్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నారాయణ, శివ, రమణమ్మ, రెడ్డెప్ప, వెంకటరమణ, మారప్ప పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భూ బాధితులు

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు : ఎస్‌పి


మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్న చిన్నపాటి వివాదాన్ని కావాలనే పెద్దది చేసేందుకు కొంత మంది ప్రయత్నించారని, అలాంటి వారిని 50 మందిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మదనపల్లెకు వచ్చిన ఎస్‌పి రాత్రి జరిగిన ఘటనపై డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ రామచంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి గొడవలు అల్లర్లు జరగకుండా సంయమనం పాటించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయంలో మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ మదనపల్లెలో మత విద్వేషాలు రెచ్చగొడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాధితుడే తమకు న్యాయం జరిగిందని చెప్పినా కూడా వినకుండా కొంతమంది స్టేషన్ వద్దకు వచ్చి గొడవకు దిగడం, ఒక హోటల్ ధ్వంసం చేయడం జరిగిందని వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. సిసి కెమెరాల పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా గొడవలో ఎవరున్నారో గుర్తిస్తున్నామన్నారు. ఇరువర్గాలు సంయమనం పాటించాలని తెలిపారు.

ఉద్రిక్తతకు దారితీసిన ఘటనపై కేసు నమోదు : పట్టణంలో ఇద్దరు ద్విచక్ర వాహనదారుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి ఏర్పడిన ఉద్రిక్తతకు దారితీసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి కొండయ్య నాయుడు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేదరవీధిలోని వెంకటేష్ అనే వ్యక్తిపై బుధవారం రాత్రి దాడికి పాల్పడ్డ కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన జియావుల్ హక్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వెంకటేష్‌పై జియావుల్ హక్ ఉద్దేశపూర్వకంగా దాడి చేసి గొడవకు కారణం కావడంతో అతనిపై అన్ని రకాల సెక్షన్ల పైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంకటేష్, తన తల్లిని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని రెడీమేడ్ దుస్తులు కుట్టే ఫ్యాక్టరీ నుండి తన టూవీలర్‌పై వస్తుండగా సిటిఎం రోడ్డులో ముందువెలుతున్న జియావుల్ హక్ ఒక్కసారిగా తన టూవీలర్ బ్రేక్ వేయడంతో ప్రశ్నించిన వెంకటేష్‌పై గొడవకు దిగి చేయచేసుకున్నారన్నారు. ఈ సంఘటన గొడవకు దారితీసిందన్నారు. వారిని టూటౌన్ పోలీసులు పోలీస్టేషన్‌కు తీసుకు వచ్చి ఇరువర్గాలవారికి సర్ది చెప్పారు. ఐతే ఈ విషయం తెలుసుకున్న బాధితుడికి మద్దతుగా కొందరు స్టేషన్ వద్దకు చేరుకుని ధర్నా చేశారని చెప్పారు. దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయడంతో వివాదం సద్దుమణిగిందన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ : బుధవారం రాత్రి అనుకోని సంఘటన జరిగి మదనపల్లి ప్రశాంతతకు భంగం కలిగే పరిస్థితి నెలకొన్న సమయంలో సమన్వయంతో వ్యవహరించిన బాధితుడు వెంకటేష్ ఇంటికెళ్లివెళ్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పరామర్శించారు. మతసామరస్యానికి, మదనపల్లి ప్రశాంతతకు అందరూ సహకరించాలని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో మత సామరస్యం కాపాడే బాధ్యత పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుంటున్న నేపథ్యంలో ఇలాంటి సంఘటనలు జరగటం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో విజయభారతి విద్యా సంస్థల అధినేత సేతు, బిజెపి నాయకులు ఎల్లంపల్లి ప్రశాంత్, జర్మన్ రాజు, తెలుగుదేశం నాయకులు కౌన్సిలర్ నాగార్జున బాబు, బెల్లే రెడ్డి ప్రసాద్, నాదెళ్ల శివప్రసాద్, షంషీర్, జివి.నాయుడు, పూలకుంట హరిబాబు, నాయీ బ్రాహ్మణ సంఘం మంజునాథ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం దుర్మార్గం : సిపిఎం

మదనపల్లె అర్బన్ : స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మతోన్మాద చర్యలను రెచ్చగొట్టే విద్రోహ శక్తులను తరిమికొట్టాలని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అయ్యప్ప భక్తులపై దాడి చేస్తే ఉపేక్షించాల్సిన అవసరం లేదన్నారు. పట్టణంలో జరిగిన బైక్ యాక్సిడెంట్ సందర్భంగా జరిగిన ఘటన ఆధారం చేసుకుని ఆర్ఎస్ఎస్ శక్తులు హోటల్‌పై దాడి చేస్తూ ఉద్రిక్తత పరిస్థితులు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. మత విశ్వాసాలను అందరూ గౌరవించాలని, ఎవరైనా భంగం కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్రమత్తంగా వ్యవహరించాల్సిన పోలీసులు నిర్లక్ష్యం కారణంగానే ఉద్రిక్తత ఏర్పడిందన్నారు. గొడవకు కారణమైన వారిని శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.114.59 కోట్లతో మున్సిపల్ వార్షిక బడ్జెట్

- ఆమోదం తెలిపిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మదనపల్లె/మదరపల్లె అర్బన్

రూ.114.59 కోట్ల అంచనాతో మదనపల్లె మున్సిపాలిటీ 2025-26 వార్షిక బడ్జెట్ రూపొందించారు. గురువారం మున్సిపాలిటీలో జరిగిన సాధారణ వార్షిక బడ్జెట్ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్‌కు చైర్‌పర్సన్ మనూజ, కౌన్సిలర్లు ఆమోదించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి బడ్జెట్ దోహదపడుతుందన్నారు. ఆదాయ, వ్యయాలను సముతుల్యం చేసి మున్సిపాలిటీ అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్దపీట వేయాలని తెలిపారు. రాజకీయాలకతీతంగా పనిచేసి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని కౌన్సిలర్లకు సూచించారు. చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అంశాలకు సరిపడే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందని, ఇందుకు కౌన్సిలర్లు ఆమోదం తెలపడం శుభ పరిణామమన్నారు. వార్డులన్నింటికీ సమానంగా బడ్జెట్ కేటాయించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ వార్డుల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని, వీధి కుక్కల సమస్య ఎక్కువైందని, బోరు మోటార్లు పనిచేయడం లేదని, ప్రోటోకాల్ నిబంధన పాటించడం లేదని తదితర సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. వీటన్నింటిని అధికారులు, చైర్‌పర్సన్ పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రోటోకాల్ నిబంధనలు అధికారులకు తెలియవా?

ప్రోటోకాల్ నిబంధనలు మునిసిపల్ అధికారులకు తెలియదా అని 14వ వార్డు కౌన్సిలర్ షేక్ షబానా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల తమ వార్డులో సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభోత్సవానికి నిబంధనల ప్రకారం తనను పిలవకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ అంశాన్ని గతంలో పలు మార్లు మున్సిపల్ సమావేశాల్లో ప్రస్తావించినా అధికారుల తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వార్డులో ప్రభుత్వ కార్యక్రమం జరిగితే ఆ వార్డు కౌన్సిలర్ తప్పనిసరిగా పిలవాలన్నారు. పిలచక పోవడం అవమానించినట్లేనన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ వ్యాఖ్యలతో ఇతర కౌన్సి లరర్లు ఏకీభవించి, ఇక మీదటైనా వార్డుల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రోటోకాల్ నిబంధనలు పాటించే విధంగా అధికారులను ఆదేశించాలని చైర్‌పర్సనుకు విజ్ఞప్తి చేశారు.


బడ్జెట్‌కు అమోదం తెలుపుతున్న కౌన్సిలర్లు



వైసిపి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

నిరసనను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా వైసిపి తలపెట్టిన పోరుబాట కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక బిసి కాలనీలో గల శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి నిరసన యాత్ర నిర్వహించబడునని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి వైసిపి నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు, మండలాల కన్వీనర్లు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు, మాజీ డైరెక్టర్లు, వైసిపి అనుబంధ విభాగాల నాయకులు,మహిళ నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సోషల్ మీడియా, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. **రామాపురం :** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వైసిపి చేపట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలందరినీగా పాల్గొని జయప్రదం చేయాలని మండల కన్వీనర్ జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైసిపి అధ్యక్షులుజగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు రాయచోటి విద్యుత్ కార్యాలయం ఎదురుగా చేపట్టే నిరసన కార్యక్రమంలో ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు.

డిప్యూటీ సిఎం దృష్టికి సుండుపల్లి సమస్యలు

ప్రజాశక్తి-సుండుపల్లి



పవన్ కల్యాణ్‌తో మాట్లాడుతున్న సుగణమ్మ, గ్రామస్తులు

మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో డ్రైనేజీ సమస్యలు, సిసి రోడ్ల దుస్థితి, మండలంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు జనసేన పార్టీ నాయకురాలు సుగణమ్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడేపల్లిలో పవన్ కళ్యాణ్ కార్యాలయంలో ఆయనను కలిసి మండలంలో జరుగుతున్నటువంటి అవినీతి అక్రమాలపైన ఆయన దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. ఆయన వెంటనే స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని అన్నారు. మండలంలోని అనేక మారుమూల ప్రాంతాలలో అభివృద్ధికి నోచుకోలేదని, రోడ్లు గుంతలమయంగా మారాయని అన్నారు. పంచాయతీ తరపున తారు రోడ్లు వేయడానికి నిధులు మంజూరు చేయాలని ప్రత్యేకంగా వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి అందాల పోటీలకు షేక్‌రీమా

ప్రజాశక్తి-సుండుపల్లె



మండల కేంద్రం సుండుపల్లికి చెందిన షేక్ రీమా జాతీయ స్థాయి అందాల పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆమె తండ్రి షేక్ జాహుద్‌బాషా తెలిపారు. రీమా బెంగళూరులోని కృపనిధి ఇన్స్టిట్యూట్‌లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోందని అన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన రాష్ట్ర స్థాయి మిస్ టీన్ అందాల పోటీల్లో పాల్గొని మొదటి స్థానాన్ని సాధించి అందరినీ ఆకట్టుకుందని అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన అందాల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక కావడం సంతోషంగా ఉందని, మరింత పై స్థాయికి వెళ్లేందుకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్లు రీమా తెలిపారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని తన తల్లి దండ్రులకు, సుండుపల్లె మండలానికి మంచిపేరు తీసుకొస్తానని తెలిపారు.

ఎపిఒగా మృత్యుంజయరావు

ప్రజాశక్తి రైల్వేకోడూరు



ఉపాధిహామీ ఎపిఒగా ఎస్.మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరు పతి జిల్లా బాలాయపల్లి మండలం నుంచి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. రైల్వేకోడూరు మండలం ఎపిఒగా బాధ్యతలు చేపట్టిన్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేస్తామని తెలిపారు.

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జాతీయ రహదారిపై గుంతలు పూడ్చాలని జనసేన నియోజకవర్గ నేత ఆకుల నరసయ్య డిమాండ్ చేశారు. గురువారం కొత్త బోయినపల్లె వద్ద జాతీయ రహదారిపై జనసేన నాయకులతో కలిసి నిరసన తెలియజేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ జాతీయ రహదారిపై భారీ గోతులు కారణంగా రోడ్డు ప్రమాదాలతో అనేకమంది మృతి చెందారని పేర్కొన్నారు. నేషనల్ హైవే పనులు ఎందుకు జాప్యం జరుగుతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యం వహించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు సైతం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అయినా చొరవ తీసుకుని జాతీయ రహదారులపై ఉన్న గోతులను పూడ్చి ప్రమాదాలు నివారించాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, ప్రతిరోజూ ఎన్నో జీవితాల్లో ఆరోగ్య దీపాలను వెలిగిస్తున్నారని యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ.ఆర్.సురేష్ పేర్కొన్నారు. పట్టణంలో పారిశుధ్య సేవలు అందిస్తున్న కార్మికులకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సురేష్ గురువారం రెయిన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులను నడిచే దేవుళ్లుగా అభివర్ణించారు. మన అందరి ఆరోగ్య బాధ్యతలు మోస్తున్న పారిశుధ్య కార్మికుల కష్టాన్ని గుర్తిస్తూ పట్టణ పరిశుభ్రతకు మనవంతు సహకారం అందించడం వల్ల వారి కష్టాన్ని కొంతైనా తగ్గించగలిగిన వారమవుతామని పేర్కొన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయాలన్నారు. ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలన్నారు. మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ ఆలోచించాలన్నారు. డిఎం అభినయ కాంత్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు అందించిన రెయిన్ కోటు

రైతుల సమస్యలకు సత్వర పరిష్కారం



నిమ్మనలపల్లి : మాట్లాడుతున్న తహశీల్దార్ ధనుంజయులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికి, నిజమైన హక్కుదారులకు చట్టపరంగా న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని డిపిఒ బాలకృష్ణారెడ్డి, తహశీల్దార్ ధనుంజయులు పేర్కొన్నారు. గురువారం అగ్రహారంలో సర్పంచ్‌లు ఉషారాణి, మహదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో టిడిపి నాయకులు మాజీ జడ్‌పిటిసి రెడ్డప్పరెడ్డి, ఈవోపీఆర్డి చలపతిరావు, ప్రభుత్వ అధికారులతో కలసి వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్‌పిటిసి రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు అనేక భూ సమస్యలు ఏర్పడడం జరిగిందన్నారు. ఎంతోమంది రైతుల భూములు కబ్జాలకు, ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 26వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులను దిగ్విజయంగా నిర్వహించామని అన్నారు. అగ్రహారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుతో మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులో 49 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇతర సమస్యలపై వచ్చిన అర్జీలకు 45 రోజుల్లోగా పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. డికెటి భూములు, నిషేధిత జాబితాలోని భూములను క్రయవిక్రయాలు చేయకూడదని, అటువంటి క్రయవిక్రయాలతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి అన్నారు. భూ కబ్జాలకు, ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అప్పటికప్పుడే ఇళ్ల నిర్మాణాల కోసం పొజిషన్ పట్టాలను జారీ చేయడం, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అందించడం, సరైన ధ్రువపత్రాలు ఉన్న వాటిని పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఉషారాణి, మహాదేవ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీరాములు, నాయకులు జయన్న, మహేష్ రెడ్డి, దయాకర్ రెడ్డి, మండల సర్వేయర్ గోపీనాథ్, అటవీశాఖ అధికారి శోభారాణి, దేవాదాయశాఖ అధికారి రాజశేఖర్, విఆర్‌ఒలు, సర్వేయర్లు, పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు. **గాలివీడు:** మండలంలోని తలముడిపి, కొర్లకుంట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు 70 దరఖాస్తుల అందినట్లు తహాశీల్దార్ జె. భాగ్యలత పేర్కొన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రఘురాం, విఆర్‌ఒ జయన్న, సర్వేయర్, విఆర్‌ఎ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

బి.కొత్తకోట : ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణంలో జరిగిన అర్బన్‌కు సంబంధించిన గ్రామ సభలో 198 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు.ఈ గ్రామసభలో దేవాదాయ శాఖ,అటవీ శాఖ,రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా పంచాయతీ పరిధిలోని భూ సమస్యలను రెవెన్యూ సిబ్బంది పరిష్క రించాలని ఆదేశించారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఓబులవారిపల్లి మండల పరిధిలోని బాల్‌రెడ్డి పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బికెఎంయు నియోజకవర్గ కార్యదర్శి జయ రామయ్య తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జయ రామయ్య మాట్లాడుతూ బాల్‌రెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ నగర్, శివాజీనగర్‌లో నివాసమున్న 70 కుటుంబాలకు చెందిన ఎస్‌టి కాలనీకి చెందిన యానాదులు ఇంటి స్థలం, భూముల కోసం ఎన్నో ఏళ్లుగా అర్జీలు సమర్పిస్తున్నా పట్టించుకునే వారే లేరన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికి ఇంటి స్థలంతో పాటు భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లి మండల కార్యదర్శి మల్లికా, వెంకటరమణ, బాల్‌రెడ్డిపల్లి మాజీ సర్పంచ్ వెలుగు సుబ్బయ్య, రేవతి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండలంలోని గంగిరెడ్డివారిపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ హరికుమార్, ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో ప్రజలు, రైతుల నుండి రెవెన్యూ, ఇతర సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిం చారు. 4రెవెన్యూ రికార్డులలో సవరణ కొరకు, 3ఎఫ్లైన్ అర్జీ, ఒక విభిన్న ప్రతి భావంతుడి పింఛన్, బ్యాటరీ వాహనం మంజూరు కొరకు ఎఎఫ్‌పి జిఆర్ ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అర్జీదారులకు రశీదు అందించినట్లు తెలిపారు. **రామసముద్రం :** రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు స్వస్తి పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేశారని తహశీల్దార్ నిర్మలాదేవి చెప్పారు.ఈ సదస్సులో రెవెన్యూ, దేవాదాయశాఖ, అటవీశాఖఅధికారులు తదితర శాఖల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలంలో ఒక్క రైతుకు కూడా రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసుపుస్తకాలు కానీ, 1బి అడంగల్, యాడింగులు కానీ ఒక పని కూడా జరిగిన దాఖలాలు లేవని అన్నారు. ప్రస్తుతం చంద్రబాబ ముఖ్యమంత్రి గా అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి,రెవెన్యూ సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు వెలుతుందని అన్నారు. రెవెన్యూ సదస్సులో ఆర్ఐ వసీం అహ్మద్, సర్వేయర్ నాగరాజ, దేవాదాయ శాఖ ఎఒ రమణారెడ్డి, అటవీశాఖ బీట్ ఆఫీసర్ చిట్టిబాబు, ఎంపిటిసి పద్మ , సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



రామసముద్రం : మాట్లాడుతున్న తహశీల్దార్ నిర్మలాదేవి

పంటల బీమా నమోదు తప్పనిసరి : డిఎఒ



గాలివీడు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-చిన్నమండెం

రబీలో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని దిగువగొట్టివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు కూడా పంటల బీమా, ఇకెవైసి చేసుకోవాలని తెలిపారు. పంట వేసిన ధ్రువ పత్రాన్ని బ్యాంకు వివరాలు సంబంధించిన పత్రాలు సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించి తక్షణ రశీదు పొందవచ్చు అని తెలిపారు. నేషనల్ క్రాఫ్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా, మొబైల్ యాప్ ద్వారా అయినా కూడా నమోదు చేసుకోవచ్చని అన్నారు. అనంతరం పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. **సుండుపల్లి :** ఉద్యానవన పంటల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యానవన అధికారి వనిత పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మామిడి, పండ్ల తోటల పంటలకు సంబంధించి రైతులు ప్రతి ఎకరాకు రూ.2,250లు చెల్లిం చి ఇన్సూరెన్స్ చేయించుకోవాలని చెప్పారు. అనంతరం రైతు సేవాసంఘం నాయకులు సుబ్బరామరాజు, జనసేనపార్టీ నాయకులు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు, ఐదు సంవత్సరాలుగా మామిడి తోటలకు చీడ పీడలు ఆశించడంతో రైతులు ఆదాయం పొందుకోలేక పోతున్నారని అన్నారు. కోల్పోయారు తోటలు దుక్కి దున్నుకోవడానికి మందులు పిచికారీ చేసుకోవడానికి కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.500 ఇన్సురెన్స్ ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి దామోదర్ నాయుడు, టిడిపి ఆనంద రెడ్డి, ఆనంద్ నాయక్, సుబ్బారాయుడు, జయరామ్, ప్రతాప్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట :**మండల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బావికాడపల్లి పంచాయతీలోని రామలింగాపురం గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రబీకి సంబంధించిన ఇ-పంట నమోదు రైతులందరూ కూడా చేయించుకోవాలని ఎఒ తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గ చూపాలని తెలిపారు. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం కషాయాలు వాడటం వలన పురుగులు, తెగుళ్లను నివారించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది పిహెచ్‌ఎ ఉదయభాను, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు :** మండలంలో సాగుచేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి గౌతమి పేర్కొన్నారు. వెలిగల్లు, తూముకుంట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జనవరి 31 వరకు ఇన్సూరెన్స్ కు సమయం ఉందని, రైతులు పండించిన పంటలను ఆమె పరిశీలించి, రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఇఒ మనీ, విఎఎ శ్రీనివాసులు రైతులు పాల్గొన్నారు.



సుండుపల్లి: మాట్లాడుతున్న ఉద్యానవనశాఖ అధికారి వనిత

ఇసుక తరలించొద్దంటూ గ్రామస్తుల ఆందోళన



ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా గేటుకు తాళం వేసిన స్థానికులు



మాండవ్య నదిలో నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రం వీరబల్లి సమీపంలోని మాండవ్యనది నుంచి గురువారం ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తున్న 40 ట్రాక్టర్లను సమీప రైతులు అడ్డుకున్నారు. ఇప్పటికే గత నెల నుంచి ఇసుక దూర ప్రాంతాలకు తరలించేశారని తెలిపారు. ఆగ్రహానికి గురైన మాండవ్య నదికి ఇరువైపులా పొలాల రైతులు ఇసుక ట్రాక్టర్లు మాండవ్య నదిలోకి వెళ్లిన వెంటనే రహదారిని మూసివేశారని అన్నారు. మామిడి తోటకు ఉన్న గేటుకు తాళం వేయడంతో ఆరు గంటల పాటు ఇసుక ట్రాక్టర్లు మాండవ్యనదిలో నుంచి బయటకు రాకుండా నిలిచిపోయాయి. ఇసుక రవాణాతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని అన్నారు. పంట పొలాలకు సాగునీరు లేక వీరబల్లిటౌన్‌కు సంబంధించిన వాటర్ స్కీమ్ నుంచి కూడ తాగు నీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను మండల పరిధిలోకి కాకుండా రాయచోటి, తదితర దూర ప్రాంతాలకు ప్రతిరోజు వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి దూర ప్రాంతాలకు ఇసుక తరలించకుండా అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - రాయచోటి : ఈనెల 26తో ముగియనున్న ఓపెన్ స్కూల్స్ ప్రవేశాల గడువును ఈ నెల 31వరకు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమరావతి వారు తత్కాల్ అడ్మిషన్స్ కోసం గడువు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కో - ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఓపెన్ స్కూల్స్ ద్వారా పదవ తరగతిలో, ఇంటర్మీడియట్ లో ప్రవేశం పొందాలనుకునే అభ్యాసకులు ఈ నెల 26 నుంచి 31 వ తేదీలోగా తత్కాల్ కింద రూ.600 ఫీజు చెల్లించి ప్రవేశం పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యాసకులు సమీపంలోని ఎపిఒఎస్ఎస్ స్టడీ సెంటర్‌లో కానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

28న కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఈ నెల 28వ తేదీన మన్నూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా సహాయ సంచాలకుల ఆధ్వర్యంలో కృత్రిమ అవయవాల పరికరాలు పంపిణీ చేస్తారని విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్, ఖాదర్‌బాషా, వెంకటప్రసాద్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్ర మానికి ఉదయం 8 గంటలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలువ మరమ్మతులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-పీలేరు: ఆర్టీసీ బస్టాండు సమీపంలోని మురుగు నీటి కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని మషా అల్లా ఆటో యూనియన్ నాయకులు పీలేరు పంచాయతీ ఇఒ గురుమోహన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ నుండి వెలుపలకు వచ్చే ప్రయాణికులకు అనుకూలంగా తమ ఆటో స్టాండ్ ఉందని, కాలువ పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇతర మార్గాల్లో రాకపోకలు సాగిస్తుండడంతో తాము తమ ఉపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇఒ గురుమోహన్ స్పందిస్తూ, ఆటో డ్రైవర్లు, వ్యాపారుల సమస్యలను అర్థం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మషా అల్లా ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చాంద్ బాష, మహబూబ్ బాష, నాయకులు నాగూర్, చాందిని, అల్తాఫ్, శివయ్య, నౌషాద్ అలీ, ఖాదర్ వలీ, బాబాయ్, ఇబ్రహీం, షఫీ, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి కృష్ణమోహన్

కళాకారుడు హత్య కేసులో నిందితులు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి - గాలివీడు

కళాకారుడు సత్తన్న అలియాస్ వెంకటరమణ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి కృష్ణ మోహన్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లి వద్ద ఆదివారం రాత్రి గణపతి రాజాతండ్రి బోడో చిన్నప్ప కర్మకాండ సందర్భంగా ఏర్పాటుచేసిన కీచక వధ వీధి నాటకంలో కీలక పాత్రధారి అయినటువంటి సప్పరం వెంకటర మణారెడ్డి, బఫూన్ పాత్రధారి అయిన సత్తన్న అలియాస్ వెంకటరమణ నాటకం ప్రదర్శించే సమయంలో మనస్పర్థలు కారణంగా గొడవ జరిగిందని తెలిపారు. వెంకటరమణ రెడ్డికి సత్తన్న అవమా నించాడని మనసులో పెట్టుకొని ఎలాగైనా చంపాలని పన్నాగం పన్నాడని అన్నారు. తన కుమారులైన శివశంకర్ రెడ్డి, రామానుజులరెడ్డి లకు ఫోన్ చేసి బోరెడ్డిగారిపల్లికి పిలిపించుకొని సత్తన్నపై దాడి చేశారన్నారు. సత్తన్న ప్రాణభయంతో అక్కడినుంచి తన సొంత గ్రామానికి వెళ్లాలని బోరెడ్డిగారిపల్లి బస్ స్టాప్ వద్దకు రాగ అక్కడికి చేరుకున్న రమణారెడ్డి గ్రామస్తుల మధ్య, తోటి కళాకారుల మధ్య నన్ను అవమానాన్ని గురిచేస్తావా రా అంటూ అక్కడ ఉన్నటువంటి బండరాయితో పలుమార్లు తలపై బలంగా కొట్టగా తలకు బలమైన రక్త గాయం కావడంతో సత్తన్న అక్కడక్కడే మృతి చెందాడని తెలిపారు. నేరం నుంచి తప్పించుకునేందుకు తన కుమారులైన శివశంకర్‌రెడ్డి, రామంజులురెడ్డికి ఫోన్ చేసి తనను అవమానించిన సత్తన్నను హత్యచేశానని చెప్పగా వారు ఆటో తీసుకొని వచ్చారని అన్నారు. సత్తన్న మృత దేహాన్ని ఆటోలో తీసుకొని మంగళపల్లి గ్రామ సమీపంలోని నల్లగుట్ట దగ్గరికి ఈడ్చుకుంటూ వెళ్లి బండరాళ్ల మధ్య పడవేశారని అన్నారు. మృతుడు సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు గాలివీడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. లక్కిరెడ్డిపల్లి సిఐ టివి.కొండారెడ్డి, గాలివీడు ఎస్ఐ రామ కృష్ణ ఆధ్వర్యంలో నిందితులను నూలివీడు మార్గంలో గరుగుపల్లి క్రాస్ వద్ద గురువారం సాయంత్రం మూడు గంటలకు అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులు నేరానికి ఉపయోగించిన ఆటో మోటార్ సైకిల్, హత్య చేయడానికి ఉపయోగించిన బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు కేసును శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేసి సరైన భౌతిక సాక్షాదారాలు సేకరించి నింది తులకు కఠిన శిక్ష పడేలా దర్యాప్తు వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. హత్య కేసులో నిందితుల అరెస్టుకు సహకరించిన సిఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ పోలీస్ సిబ్బందిని అభినందించారు.

మందుబాబుల వీరంగం : గోడ నేలమట్టం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని మైసూరువారిపల్లె పంచాయితీ రాజానగర్ ప్రయివేట్ మామిడికాయల మండిల వద్ద ఉన్న శ్రీనగర్ వెంచర్ గోడను గుర్తుతెలియని మందుబాబులు పూర్తిస్థాయిలో గోడను కూల్చివేసినట్లు బాధి తులు సుబ్రహ్మణ్యం సాయి, అంజిరెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బ్రాందీషాపు ఉన్నందున కొందురు మద్యపాన ప్రియులు అత్యుత్సాహం చూపి తాము కట్టుకున్న గోడను కూల్చివేశారని పోలీసు లకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమకు రూ.1.20లు నష్టం వాటిల్లిందని, గోడ పగులగొట్టినవారిపై చర్యలు న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలం లోని స్థానిక కలకడ-కొత్తపల్లి సమీపంలో ఉన్న చర్చి వద్ద బొలెరో వాహనం అతివేగంగా వచ్చి టివిఎస్ స్కూటర్‌ను ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రాయచోటికి చెందిన ఉపాధ్యాయుడు అన్వర్‌బాషా ఏనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధి నిర్వహణలో భాగంగా తన టివిఎస్ స్కూటర్‌పై విధులకు బయలుదేరినట్లు తెలిపారు. మండలంలోని కోన పంచాయితీ బంగారు కొండపల్లికి చెందిన షంషీర్‌బాషా తన బొలెరో వాహనాన్ని అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అన్వర్‌బాషాకు కుడికాలు విరిగిందని తెలిపారు. స్థానికులు108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ వైద్యశాల చికిత్స నిమిత్తం తరలించినట్లు వాహన సిబ్బంది తెలిపారు.

బైక్, ఆటో ఢీ : యువకుడి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని బోరెడ్డిగారిపల్లి పంచాయతీ బక్కిరెడ్డిపల్లి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొట్లపల్లి పవన్(18) అనే యువకుడు మృతి చెందినట్లు సిఐ కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణతెలిపారు. మృతుడు గాలివీడు నుంచి పందేళ్ళపల్లికి బైక్‌పై వెళుతుండగా లక్కిరెడ్డిపల్లి నుంచి వస్తున్న ఆటో బక్కిరెడ్డిపల్లి దగ్గర బైక్‌ను ఢీ కొట్టినట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన పవన్‌ను సిఐ వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గువ్వలచెరువు ఘాట్‌లో అదుపుతప్పిన లారీ

తృటిలో తప్పిన ప్రమాదం : డ్రైవర్, క్లీనర్ సురక్షితం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్‌లో రెండవ మలుపు వద్ద గురువారం సిమెంట్ లారీ అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి డ్రైవర్, క్లీనరు ప్రాణాలతో బయటపడ్డారు. రక్షణ గోడ పైకెక్కి లారీ ఆగిపోయింది. రక్షణ గోడ లేనిపక్షంలో50 అడుగుల లోతు లోయలో లారీ సిమెంట్‌తో సహా పడిపోయేదని చెబుతున్నారు. తుపాను కారణంగా చిరుజల్లులు కురుస్తుండడంతో రోడ్డుపై తేమ ఉండడం టైర్లు రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్ల మలుపులో ఘాటు దిగుతూ ఉండడం ప్రమా దనికి కారణం తెలుస్తుంది. ఘాటు ప్రయాణించే వాహనదారులు వర్షాలు వల్ల రోడ్డు పై తేమ ఉండడం రోడ్డు గ్రిప్పు కోల్పోవడం వల్ల ప్రమాదాలు జరగవచ్చు ఘాటుపై నెమ్మదిగా వెళ్లి సురక్షితంగా గమ్యస్థా నాలకు చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.



డివైడర్‌ను ఢీకొని ఆగిపోయిన లారీ

కడపలోనే కొనసాగేలా చర్యలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్రస్థాయి విలీనం తర్వాత ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ అధికారులను కలుస్తామని, ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తామని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్సీ కార్యాలయంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీష్ బృందానికి ఆయన ఈ మేరకు హామీ ఇచ్చారు.